సాక్షి
పెద్దపల్లి

ఆదివారం, 14, మే, 2023



నేత్రదానం మహాదానం

ళైటింక్లయిన్‌కాలనీ: నేత్రదానం మహాదాన మని మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు.మానేటి రాజన్న సంస్మరణ సభలో మాట్లాడారు.



ధాన్యం కొనాలి

మంథని: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని ముత్తారం మండలం ఖమ్మంపల్లిలో శనివారం రైతులతో కలిసి కాంగ్రెస్ నాయకులు ధర్నా చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0/28.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

అమ్మయాదిలో..

మాతృమూర్తి పేరిట సేవాసంస్థలు

- ఉమ్మడి జిల్లాలో పలు కార్యక్రమాలు
- అనాథాశ్రమాలు.. ట్రస్టుల ద్వారా చేయూత
- తల్లిపేరు చిరకాలం గుర్తుండేలా సేవా
- నేడు మదర్స్ డే

అమ్మా.. రెండక్షరాల ఆత్మీయ బంధం. సృష్టిలో మొదటిదైవం. మనిషి నూరేళ్ల జీవితానికి మూలకారణం. నవమాసాలు మోసి.. పొత్తిళ్లలో పెట్టుకుని పెంచే అమ్మప్రేమ వెలకట్టలేనిది. తాను పస్తులున్నా.. పిల్లల ఆకలిని తీరుస్తుంది. కష్టమొస్తే అమ్మ కళ్లలోంచి కన్నీళ్లు వస్తాయి. బిడ్డలు ఎదిగితే తల్లి మనసు సంతోషం వ్యక్తం చేస్తుంది. అలాంటి అమ్మంటే ఈ ప్రపంచంలో ప్రేమించనివారు ఉండరు. రక్తంపంచి ప్రాణంపోసి.. చేయిపట్టి జీవితాన్ని ఇచ్చిన అమ్మ తమను వదిలి వెళ్లినా.. ఆ మాతృమూర్తికి చిహ్నంగా అమ్మయాదిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన చాలా మంది పలుసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనాథాశ్రమాలు.. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి ఆపదలో ఉన్నవారిని చేరదీస్తున్నారు. కొందరు అనాథ పిల్లలకు అమ్మగా మారుతుండగా.. మరికొందరు అనాథవృద్ధుల్లో తమ తల్లులను చూసుకుంటున్నారు. అమ్మకు ప్రేమతో సేవా కార్యక్రమాలు చేపడుతున్న వారిపై మాతృదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..!!

రంగినేని ఎల్లమ్మ పురస్కారాలు

సిరిసిల్ల:అమ్మ యాదిలో కవులు, రచయితలను ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా సాహిత్యపు పండగను సిరిసిల్ల శివారులోని 'రంగినేని' ట్రస్ట్‌లో నిర్వహిస్తారు. రంగినేని ఎల్లమ్మ పేరిట ఆమె తనయుడు రంగినేని మోహన్‌రావు రెండు దశాబ్దాలుగా సాహిత్య పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు.తల్లిదండ్రులు లేని పిల్లలకు రంగినేని సుజాత మోహన్‌రావు ట్రస్ట్ అండగా నిలుస్తోంది.1,243 మంది పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించారు. 151 మంది ఉద్యోగాలు సాధించారు. పిల్లలు, వృద్ధుల కోసం ట్రస్ట్ నిర్వహిస్తున్నాం అని వ్యవస్థాపకుడు రంగినేని మోహన్‌రావు వివరించారు.





2021లో రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారాన్ని వెంకట్ సిద్దారెడ్డికి అందిస్తున్న 'సాక్షి' ఎడిటర్ వర్ధెల్లి మురళి(ఫైల్)

చదువులకు భరోసానిస్తూ..




పాఠశాలకు డెస్కులు అందిస్తున్న గంగప్రసాద్

కథలాపూర్(వేములవాడ):తల్లి పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేశారు కథలాపూర్ మండలం తాండ్ర్యాలకు చెందిన అన్నదమ్ములు గుజ్జెటి గంగప్రసాద్, గుజ్జెటి శ్రీనివాస్. గంగప్రసాద్ ముంబయిలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేస్తున్నాడు. తల్లి గుజ్జెటి శంకరవ్వ 20ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. తల్లి జ్ఞాపకార్థం 'గుజ్జెటి శంకరవ్వ' ట్రస్ట్ ఏర్పాటు చేశారు. తాము చదువుకున్న పాఠశాలకు సౌండ్ సిస్టమ్స్, కంప్యూటర్లు, డ్యూయల్ డెస్కులు అందించారు.

అమ్మ గుర్తుగా..

జ్యోతినగర్(రామగుండం): గోదావరిఖని ఎల్కలపల్లి గేట్‌ప్రాంతానికి చెందిన దాసరి మహేశ్ చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. కష్టపడి మంచం పట్టిన తల్లిని చూసుకున్నాడు. కొన్నాళ్లకు తల్లి కూడా తుదిశ్వాస విడిచింది. అభాగ్యులకు అమ్మపేరిట సాయం చేయాలని సంకల్పించి 2012లో తల్లి 'ప్రేమలత' పేరుతో 'ప్రేమ' చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశాడు. ప్రయివేటు ఉద్యోగం చేసే మహేశ్ తనకు వచ్చే వేతనం నుంచి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు సామాజిక కార్యక్రమాలకే వెచ్చిస్తున్నాడు. అనాథల ఆకలి తీరుస్తున్నాడు. పేద పిల్లల చదువుకు సాయం చేస్తున్నాడు. వృద్ధులను చేరదీస్తున్నాడు. ఈయన సేవలు గుర్తించి పలు సంఘాలు జాతీయ అవార్డులతో సత్కరించాయి.




ట్రస్టులో సేవలందిస్తున్న మహేశ్

ఆకలి తీరుస్తూ..

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ రేకుర్తిలోని విజయపురికాలనీకి చెందిన గోదరి జితేందర్ తన అమ్మపేరిట నిర్వహిస్తున్న నిత్యాన్నదానం 899రోజులకు చేరుకుంది. రెండేళ్లవయస్సులోనే తల్లిని కోల్పోయిన జితేందర్ అమ్మకోసం ఏదైనా చేయాలనే సంకల్పంతో 2016 ఫిబ్రవరి 15న 'గోదరి కాంతలక్ష్మి సేవా సమితి' ఏర్పాటు చేశాడు. అన్నార్థులు, అనాథలు, నిరాశ్రయులు, అభాగ్యులకు 2020 నవంబర్ 27 నుంచి నిత్యాన్నదానం నిర్వహిస్తున్నాడు. ప్రతీరోజు 50 నుంచి 70మందికి కడుపునిండా భోజనం అందిస్తున్నాడు. వైద్య, రక్తదాన శిబిరాలు, ఓటరు, పర్యావరణంపై అవగాహన, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. ఒంట్లో జీవం ఉన్నంతవరకు అమ్మపేరిట సేవ చేస్తా అని జితేందర్ చెప్పుకొచ్చాడు.





నిరాశ్రయులకు అన్నదానం చేస్తున్న జితేందర్

నేడు చీరల పంపిణీ

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణానికి చెందిన గంగిశెట్టి మధురమ్మకు ఐదుగురు కొడుకులు. చిన్నకొడుకు జగదీశ్వర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవలే జమ్మికుంట పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందాడు. తల్లి మధురమ్మ 14ఏళ్ల క్రితం మృతి చెందింది. 2017లో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఏర్పాటు చేశాడు. ఇప్పటివరకు రూ.40లక్షలు సేవా కార్యక్రమాలకు వెచ్చించాడు. 26మండలాల్లో రూ.2లక్షల విలువ చేసే 7వేల పరీక్ష ప్యాడ్లు, 76పాఠశాలలో ప్లేట్లు, డిక్షనరీలు, క్రీడా సామగ్రి, నోట్‌బుక్స్, తదితర సామగ్రి అందించాడు. ఆదివారం మదర్స్ డే సందర్భంగా 200మంది మహిళలకు అమ్మ జ్ఞాపకంగా చీరలు పంపిణీ చేయనున్నట్లు జగదీశ్వర్ తెలిపారు.



గతేడాది మదర్స్ డే సందర్భంగా వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్

అమ్మ ఒక సముద్రం

- ప్రముఖ కథ రచయిత కెవి.నరేందర్

జగిత్యాల: అమ్మ గురించి ఎవరెంత రాసినా.. సముద్రాన్ని దోసిళ్లతో తోడినట్టే అంటున్నారు ప్రముఖ రచయిత కేవీ.నరేందర్. అమ్మపేరుతో 20ఏళ్ల క్రితం తన తొలికథ సంకలనాన్ని వెలువరించారు. ఆ సంపుటి నరేందర్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. ఆ కథలు రాయడానికి గల స్ఫూర్తిని మదర్స్‌డే సందర్భంగా 'సాక్షి'తో నరేందర్ పంచుకున్నారు. '20 ఏళ్ల క్రితం మంథని డివిజన్‌లోని ఓ గ్రామానికి సర్పంచ్ ఎలక్షన్ల డ్యూటీకి వెళ్లాను. ఓ ముసలావిడ రెండు గుర్తుల పైన ఓటు వేసింది. అది గమనించిన నేను అవ్వ ఓటు చెల్లదేమో? అన్నాను. పోటీ పడుతున్నది ఇద్దరు నా కొడుకులే అని ఓటు డబ్బాలో వేసి వెళ్లిపోయింది. ఆ ఓటు చెల్లకపోవచ్చు. కానీ తల్లి ప్రేమకు అంతకన్న గొప్ప నిదర్శనం ఏమి ఉంటుంది. అదే విషయాన్ని అమ్మను పంచుకుందాం పేరుతో కథగా మలిచాను. ఇది 'ఆటా' అమెరికా తెలుగు అసోసియేషన్ సంఘం వారు ప్రత్యేక సంచికలో వేశారు. మండలాధ్యక్షురాలిగా ఉన్న ఇద్దరు పిల్లల తల్లి మూడోసారి గర్భం ధరించగానే ప్రత్యర్థులు అవిశ్వాసం పెట్టారు. భర్తను తిట్టయినా పదవీని వదులుకుంది గానీ గర్భాన్ని తీయించుకోలేదు. ఆదిలాబాద్ జిల్లా వెన్నెల మండలంలో జరిగిన సంఘటన ఇదీ. దీని ఆధారంగానే అవిశ్వాసం అనే కథ రాశాను. ఓల్డేజీ హోమ్‌లు ప్రతి నగరంలో విస్తరించడాన్ని ఒక తల్లి సమర్థిస్తే ఆశ్చర్యపోయాను. పిల్లల మనస్తత్వాన్ని తల్లి మాత్రమే అంత గొప్పగా విశ్లేషించగలదని అర్థమయ్యాక 'సాక్షి'లో రెక్కలు అనే కథ రాశాను. అమ్మ కథ సంకలనంలోని 14కథలు ఇలాంటి స్ఫూర్తితో రాసినవే'. అని నరేందర్ వివరించారు.



అమ్మ కథ సంపుటి



కెవి.నరేందర్

అమ్మ నాకు బెస్ట్ ఫ్రెండ్

- రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్

కోల్‌సిటీ(రామగుండం): 'అమ్మ నాకు బెస్ట్‌ఫ్రెండ్.. అమ్మతో చాలా విషయాలు షేర్‌చేసుకుంట.. నా కూతురుతో కూడా నేనుబెస్ట్ ఫ్రెండ్‌గా ఉంటున్నా' అని రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్ తెలిపారు. 'మదర్స్‌డే' సందర్భంగా తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. అమ్మ శాంతిసింగ్ గైనకాలజిస్టు. నాన్న కృష్ణాసింగ్ సర్జన్. అమ్మనాన్న వయసు పెరగడంతో ప్రస్తుతం అమెరికాలోని మా బ్రదర్స్ దగ్గర ఉంటున్నారు. అమ్మనాన్న ఇద్దరూ డాక్టర్ కావడంతో నేను కూడా డాక్టరయ్యాను. నా భర్త కూడా డాక్టర్. దీంతో మా కూతురు కూడా మెడిసిన్ చేసింది. మాకు ఇద్దరు కుమారులు, కూతురు. పెద్ద బాబు ఐదేళ్ల క్రితం కేన్సర్‌తో మరణించాడు. అప్పుడు చాలా డిప్రెషన్‌కు గురయ్యాను. అమ్మ నన్ను చాలా ఓదార్చింది. మేం కలిసినప్పుడల్లా ఇద్దరిలో నవ్వులే ఉంటాయి. మా కూతురుతో కూడా ఫ్రెండ్‌గా ఉంటున్న. ప్రొఫెషనల్‌గా నేను బీజీగా ఉన్నప్పటికీ నాకు హెల్ప్‌గా ఉంటూ చాలా ఫ్రీడం ఇస్తుంది. ప్రస్తుత జనరేషన్ పిల్లలు అమ్మకున్న ఇబ్బందులు తెలుసుకోవాలి. అమ్మ ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉండకుండా అన్నిపనుల్లో తోడుగా ఉండాలి.



డాక్టర్ హిమబిందు సింగ్

కష్టపడి చదివితే బంగారు భవిష్యత్తు



ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆర్ఎఫ్‌సీ ఎల్ సీజీఎం సుధీర్‌కుమార్ ఝా పేర్కొన్నా రు. ఆర్ఎఫ్‌సీఎల్‌లోని టౌన్‌షిప్‌లో శనివారం ప్రైవేటు పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అనంతరం సీజీఎం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ ఉన్నతాధికారులు, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి ఉన్నారు.

వాయుపుత్రా.. వందనం

- నేత్రపర్వంగా హనుమాన్ జయంతి
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- కాలినడకన చేరుకున్న స్వాములు



పాదయాత్రగా వస్తున్న అంజన్న స్వాములు



విశేషాలంకరణలో అంజన్న మూలవిరాట్టు

మల్యాల(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధి జై హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు వందల కిలోమీటర్ల దూరం నుంచి కాలినడకన కొండగట్టుకు చేరుకున్నారు. స్వాముల రాకతో ఆలయం కాషాయమయమైంది. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఖమ్మం, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాలతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది తరలివస్తున్నారు. శనివారం సాయంత్రం వరకే సుమారు 50వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. ఆదివారం తెల్లవారుజాము వరకు మరో రెండు లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలిపారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వామివారి మూలవిరాట్టును 11 రకాల పండ్లు, 108 కిలోలతో అలంకరించారు. చందనాలంకారం చేశారు. పంచామృతాభిషేకం నిర్వహించారు. దేవస్థానం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. యాగశాలలో హోమం నిర్వహించారు. ప్రధాన అర్చకులు జితేంద్రస్వామి, రామకృష్ణ, రఘు, చిరంజీవిస్వామి, మారుతిస్వామి, ఈవో వెంకటేశ్ పాల్గొన్నారు.



కొండగట్టు ఆలయ పరిసరాల్లో హనుమాన్ మాలధారులు

క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శులకు బీజేపీ మద్దతు



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద గత 16 రోజులుగా పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని శనివారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు సందర్శించి, సంఘీభావం తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రజలకు, ఉద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాజేశ్వర్‌రావు, మహిపాల్‌రెడ్డి, వెంకటరమణ, సంపత్‌రావు, మహేశ్, రాజన్న ఉన్నారు.

అనారోగ్యంతో ఒంటరి మహిళ మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ప్రగతినగర్(పాతకోర్టు) సమీపంలో నివసించే ఒంటరి మహిళ గౌడాల సత్తమ్మ(75) శనివారం మృతిచెందింది. దాదాపు వారం రోజుల క్రితమే మరణించగా ఎవరూ గుర్తించలేదు. దుర్వాసన వస్తుండడంతో ఇరుగుపొరుగువారు అందించిన సమాచారంతో పోలీసులు వెళ్లి చూడగా సత్తమ్మ మృతిచెందిన విషయం వెలుగుచూసింది. అనారోగ్యంతో మరణించి ఉంటుందని భావిస్తున్నారు. మృతురాలి భర్త మధుసూదన్ పెద్దపల్లి ఎంపీడీగా పనిచేశారు. ఆయన దాదాపు ఎనిమిదేళ్ల క్రితం మరణించగా అప్పటి నుంచి సత్తమ్మ ఒంటరిగానే ఉంటోంది. మృతురాలికి ఇద్దరు కొడుకులు, ఓ కూతురు ఉన్నారు.

కిరాణదుకాణంలో దొంగతనం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయం ముందు గల కిరాణదుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. షాపు యజమాని ప్రశాంత్ శనివారం ఉదయం దుకాణం తెరిచే సమయంలో షట్టర్ తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించారు. క్యాష్ కౌంటర్‌లోని రూ.15వేలు దొంగతనానికి గురైనట్లు నిర్ధారించుకుని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడ్డ గీతకార్మికుడు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన బొబ్బిలి సమ్మయ్య శనివారం తాటి చెట్టు పై నుంచి పడడంతో గాయపడ్డాడు. ప్రమాదంలో కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. బాధితుడిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం కరీంనగర్ తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని మేడిపల్లి గ్రామం వద్ద శనివారం సాయంత్రం ఆటో ఢీకొని ద్విచక్రవాహనదారుడు మాడ హన్మండ్లు (40)అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాలు.. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం మల్లారం గ్రామానికి చెందిన మాడ హన్మండ్లు, కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం చిన్నదేవడ గ్రామానికి చెందిన దుర్కి లక్ష్మణ్ ద్విచక్ర వాహనంపై మెట్‌పల్లి నుంచి నిజామాబాద్ వెళ్తున్నారు. మేడిపల్లి వద్ద ఆటో ఢీకొనడంతో హన్మండ్లు మృతిచెందగా, దుర్కి లక్ష్మణ్‌కు గాయాలు కావడంతో మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉమసాగర్ పేర్కొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని భవానీనగర్‌కు చెందిన గందం దుర్గయ్య(60) వడదెబ్బతో మృతిచెందాడు. దుర్గయ్య చిలుక జోస్యం చెప్పడానికి శనివారం సైకిల్‌పై వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో నర్సింగాపూర్ శివారు కాలువ వద్ద అస్వస్థతతో మృతిచెందాడు.

కర్ణాటకీయంలో మనోళ్ల పాత్ర అదుర్స్

- కాంగ్రెస్ గెలుపులో జిల్లా నేతల కీలకపాత్ర
- శ్రీధర్‌బాబు నేతృత్వం వహించిన నియోజకవర్గాల్లో విక్టరీ



డి.శ్రీధర్‌బాబు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కర్ణాటకలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించి చరిత్ర సృష్టించింది. శనివారం విడుదలై ఫలితాలు కాంగ్రెస్‌కు పట్టం కట్టాయి. పొరుగు రాష్ట్రం కావడం, మన రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలలే సమయం ఉండటంతో ఈ ఎన్నికల ప్రభావం మన రాష్ట్రంపైనా ప్రభావం చూపిస్తుంది. ఆ మేరకు సంబంధాలు ఉన్నాయి కాబట్టే.. అక్కడ మన రాష్ట్రం నుంచి అందులోనూ ఉమ్మడి జిల్లాల నుంచి బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి పలువురు నాయకులు వెళ్లి ప్రచారం నిర్వహించి వచ్చారు. ఎవరెవరు ఎక్కడ ప్రచారం చేశారో ఒకసారి పరిశీలిద్దాం.!

- కర్ణాటకలోని గుల్బర్గా, బీదర్, యాదగిరి నియోజకవర్గాల్లో జగిత్యాల జిల్లా నుంచి డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో పాల్గొన్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుపొందింది.
- మంథని ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి శ్రీధర్‌బాబు కళ్యాణ కర్ణాటకకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఏఐసీసీ కార్యదర్శి మల్లికార్జునఖర్గే ఏరియాలోని ఏడు జిల్లాలో 41 అసెంబ్లీ నియోజకవర్గాలకు శ్రీధర్‌బాబు ఇన్‌చార్జిగా ఉన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు ముందు నుంచి ఇక్కడి రాష్ట్రంలో శ్రీధర్‌బాబు పార్టీ వ్యవహారాల్లో సమన్వయం చేస్తున్నారు.
- నిజామాబాద్ మాజీ ఎంపీ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పాలుపంచుకున్నారు.
- పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్ ఠాకూర్ ప్రచారం నిర్వహించిన కళ్యాణ్ గుల్బర్గాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు.
- **కమలనాథులకు ప్రతికూలమే..!**

హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కల్బుర్గి రూరల్ జిల్లా సేడం, చించోలి నియోజకవర్గాలలో ప్రచారం చేశారు. చించోలిలో బీజేపీ అభ్యర్థి విజయం సాధించగా, సేడంలో కాంగ్రెస్ గెలిచింది. మధుగిరి జిల్లాలోని సిర, మధుగిరి, పవగడ నియోజకవర్గాల ప్రచారంలోనూ పాల్గొన్నారు. ఈ మూడింట్లోనూ కాంగ్రెస్ విజయం సాధించింది.

- కర్ణాటకలో బండి సంజయ్.. చింతామణి, ముల్బగల్, బాగేపల్లి, గౌరీబిదనూర్, చిక్కబల్లాపూర్ స్థానాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగు ప్రజలు అధికంగా ఉన్న కోలార్, చింతామణి, ముల్బగల్ నియోజకవర్గాల్లో బీజేపీ మూడో స్థానానికే పరిమితమైంది. ఇక గౌరీబిదనూర్‌లో అయితే ఏకంగా ఐదో స్థానానికి.. బాగేపల్లి, చిక్కబల్లాపూర్‌లో భారీ వ్యత్యాసంతో ఓటమి చవిచూసింది.



గోదావరిఖనిలో క్షీరాభిషేకం చేస్తున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



పెద్దపల్లిలో సంబరాల్లో విజయరమణారావు

కాంగ్రెస్ సంబరాలు

గోదావరిఖని: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాలువ లింగస్వామి, మాదరబోయిన రవికుమార్, కార్పొరేటర్లు మహంకాళీస్వామి, ఎండీ ముస్తఫా, గాదం విజయానంద్, సనా ఫక్రుద్దీన్, నగునూరి సుమలత, దొంతుల లింగం, నజీమొద్దీన్, గట్ల రమేశ్, వీరబోయిన రవియాదవ్, ధూళికట్ట సతీశ్ పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై పెద్దపల్లిలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు ఆధ్వర్యంలో జెండా కూడలిలో బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. సురేశ్‌గౌడ్, మల్లయ్య, సారయ్య, నెత్తెట్ల కుమార్, సుభాశ్, శ్రీమాన్, మస్రత్, సర్వర్, సునీల్, సంతోష్, రమేశ్ జగదీశ్ ఉన్నారు.

కాంగ్రెస్ విజయోత్సాహం

పేద విద్యార్థులకు అండగా ఉంటా..



విద్యార్థులను అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ

మంథని: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివిన పేద విద్యార్థులు మెరిట్ సాధించడం అభినందనీయమని, వీరి ఉన్నత చదువులకు తనవంతు సాయం అందిస్తానని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు తెలిపారు. ఇటీవల వెలువడిన పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల విద్యార్థులకు పుట్ట లింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను ఎంతగానో బలోపేతం చేశారన్నారు. గత పాలకులు పేద విద్యార్థుల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ పాల్గొన్నారు.

తల్లులకు పాదపూజ చేసిన కూతుళ్లు



తల్లులకు పాదపూజ చేస్తున్న కూతుళ్లు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ముందస్తుగా మదర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని చిన్నారులకు తల్లి ప్రాధాన్యతను వివరించి కూతుళ్లతో తల్లులకు పాద పూజ చేయించారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకురాలు పెండ్యాల విమలమ్మ, మహిళలు ఐలవేణి మహతి, బాదరవేణి అనూష, అరకాల భాగ్యలక్ష్మి ఉన్నారు.

సుపారీ గ్యాంగ్ అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాలోని బీర్‌పూర్ మండలం కండ్లపల్లికి చెందిన నారపాక కమలాకర్‌పై హత్యాయత్నానికి పాల్పడిన ఐదుగురు సుపారీ గ్యాంగ్ నిందితులను అరెస్ట్ చేసినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ తెలిపారు. కమలాకర్, కండ్లపల్లికి చెందిన నారపాక రమేశ్ మధ్య ఆస్తి తగాదాలున్నాయి. కమలాకర్‌ను చంపాలని రమేశ్ తన బంధువు గొల్లపల్లికి చెందిన కోండ్ర చంద్రయ్యకు చెప్పాడు. చంద్రయ్య జన్నారంకు చెందిన షేక్ రియాజ్ సుపారీ గ్యాంగ్‌తో రూ.4లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. షేక్ రియాజ్ అతడి తమ్ముడు ఇలియాజ్, మిత్రులు మహ్మద్, బుచ్చన్న, సంపత్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. హత్యాయత్నం సమయంలో జరిగిన పెనుగులాటలో ఇలియాజ్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సుపారీ గ్యాంగ్ సభ్యులను అరెస్ట్ చేశారు. నారపాక రమేశ్, షేక్ ఇలియాజ్ పరారీలో ఉన్నారు.

ఆకలైతుందంటివి బిడ్డా..

- లారీ ఢీకొని హార్వెస్టర్ డ్రైవర్ మృతి
- భోజనానికి ఇంటికొస్తుండగా ప్రమాదం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఆకలైతుందని ఇంటికొస్తున్నానని ఫోన్ చేస్తివి కొడుకా.. ఇంతలోనే మాయమైతివా బిడ్డా.. అంటూ ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వారిని ఆపడం ఎవరి తరమూ కాలేదు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మంగపేటలో శనివారం లారీ ఢీకొని అదే గ్రామానికి చెందిన బండి సతీశ్(26) అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న సతీశ్ కూనారంలో వరి పొలం కోసి భోజనం చేసేందుకు ఇంటికెళ్తున్నాడు. ఈక్రమంలో పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్‌కు వస్తున్న లారీ ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర రక్తస్రావమై సతీశ్ మృతిచెందాడు. డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు ఆరోపించారు. మృతుడికి భార్య మౌనిక, కూతుళ్లు హన్సిక, సాత్విక, తల్లిదండ్రులు లక్ష్మి–కొమురయ్య ఉన్నారు. నిరుపేద సతీశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ బుర్ర మంగ కోరారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కాల్వశ్రీరాంపూర్ పోలీసులు తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జీజీహెచ్‌లో కొత్త బ్లాక్ కష్టాలు



రామగుండం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లోని కొత్త బ్లాక్‌కు వెళ్లే రోగులు, వారి బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త బ్లాక్‌లోనే ఔట్‌పేషంట్లకు సేవలందిస్తున్న విషయం తెలియని చాలా మంది ఓపీలకు వెళ్తున్నారు. అక్కడి నుంచి కొత్తబ్లాక్‌కు పంపిస్తుండడంతో నడవలేకపోతున్నారు. నడవలేని వృద్ధులను కొత్త ఓపీ బ్లాక్‌కు వీల్‌చైర్‌లో తీసుకొచ్చేందుకు కేర్‌టేకర్లు ముందుకు రావడం లేదు. గోదావరిఖని అడ్డగుంటపల్లికి చెందిన వృద్ధుడు గురవయ్య శనివారం నడవలేని స్థితిలో ఉండగా.. కుటుంబ సభ్యులే వీల్‌చైర్‌లో నెట్టుకుంటూ కొత్త బ్లాక్‌కు తీసుకొచ్చారు. ఆస్పత్రి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

– కోల్‌సిటీ(రామగుండం)

వందశాతం ఉత్పత్తి అభినందనీయం

- ఆర్జీ–2 జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): వకీల్‌పల్లిగనిలో కంటిన్యూస్ మైనర్ యంత్రం ద్వారా నిరంతరాయంగా బొగ్గు ఉత్పత్తి చేయడం అభినందనీయమని ఆర్జీ–2 జీఎం మనోహర్ పేర్కొన్నారు. లక్ష్యాలకు మించి బొగ్గు ఉత్పత్తి చేసిన సందర్భంగా గని మేనేజర్‌కు శనివారం ఆర్జీ–2 జీఎం ప్రశంసాపత్రం అందజేశారు. స్ట్రాటా బంకర్ నిర్మాణం అనుకున్న సమయంలో పూర్తిచేసి వినియోగంలోకి తేవడం మామూలు విషయం కాదన్నారు. ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించారు. ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరెడ్డి, కాలరీ మేనేజర్ రవికిరణ్, గ్రూప్ ఇంజినీర్ బి.చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ వి.తిరుపతి, పిట్ ఇంజినీర్ కె.జలపతి, సర్వే ఆఫీసర్ ఎండీ రెహమత్ అలీ, సంక్షేమాధికారి ఓంకారిబాబు పాల్గొన్నారు.



మేనేజర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న జీఎం మనోహర్

వకీల్‌పల్లి గనిని సందర్శించిన డీఎంఎస్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని వకీల్‌పల్లిగని డీఎంఎస్ ఐ.సత్యనారాయణ శనివారం సందర్శించారు. గనిలో నడుస్తున్న కంటిన్యూస్ మైనర్–6 ఎల్‌హెచ్‌డీ సెక్షన్ పనిస్థలాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గని ఏజెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ పి.రవికిరణ్, గ్రూప్ ఇంజినీర్ బి.చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ వి.తిరుపతి, పిట్ ఇంజినీర్ జలపతి, సర్వే ఆఫీసర్ ఎండీ రెహమత్ అలీ, సంక్షేమాధికారి ఓంకారిబాబు, సీనియర్ అండర్ మేనేజర్ మధుకర్‌రెడ్డి, అజయ్‌కుమార్ పాల్గొన్నారు. గని ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరెడ్డి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.



సన్మానిస్తున్న వకీల్‌పల్లిగని అధికారులు

నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచాలి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సూపర్ బజార్‌లో కార్మికుల కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం గోదావరిఖని సూపర్‌బజార్ డివిజనల్ మేనేజర్ ప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం గోదావరిఖని సూపర్ బజార్‌ను లక్షల రూపాయలు వెచ్చించి ఆధునీకరించినప్పటికీ అందులో కార్మికులకు అవసరమయ్యే నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. గత రెండు నెలలుగా నిత్యావసర వస్తువులు అందుబాటులో లేక కార్మికులు వాపస్ పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు రంగు శ్రీనివాస్, నాయకులు ఎంఏ గౌస్, మద్దెల దినేశ్, శనగల శ్రీనివాస్, బూడిద మల్లేశ్, రాజయ్య, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

‘చికెన్ సెంటర్ వద్ద శుభ్రంగా ఉంచుతా..’

సుల్తానాబాద్(పెద్దపల్లి): నిత్యం చికెన్ సెంటర్ వద్ద శుభ్రపరస్తానని చికెన్ సెంటర్ యజమాని గౌస్ సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌కు రాతపూర్వకంగా హామీపత్రం ఇచ్చారు. చికెన్‌సెంటర్ నుంచి దుర్వాసన వస్తుండడంతో కమిషనర్ శనివారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చికెన్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తానని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతానని నిర్వాహకుడు హామీపత్రం రాసిచ్చారు. భవిష్యత్తులో ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.



చికెన్ సెంటర్‌లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికుడు

కాంగ్రెస్ గెలుపులో భారత్ జోడో యాత్ర కీలకం

- ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): కర్ణాటకలో కాంగ్రెస్ ఘన విజయంలో భారత్ జోడోయాత్ర కీలకంగా మారిందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో సంబరాలు చేశారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ అద్భుతమైన విజయంలో రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర, ఖర్గే చరిష్మా ముఖ్య పాత్ర పోషించాయన్నారు. ఇదే స్ఫూర్తితో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలువబోతుందని ధీమా వ్యక్తం చేశారు. సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి, సెంట్రల్ జనరల్ సెక్రెటరీ లక్ష్మీపతిగౌడ్, వైస్‌ప్రెసిడెంట్ సదానందం, అక్బర్ అలీ, మనోహర్, శ్రీనివాస్, పోచయ్య, మహేశ్‌బాబు, సత్యనారాయణ, మార్కండేయ పాల్గొన్నారు.



చౌరస్తాలో సంబరాలు జరుపుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు